క్లుప్తంగా

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



రేపల్లె రూరల్: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని మున్సిపల్ వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఓల్డ్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు కాశేపల్లి ఈశ్వరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొలిశెట్టి సత్యనారాయణ, ఆర్యవైశ్యులు కె.మహేష్ గుప్త, నంబూరు సత్యప్రసాద్, పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పిన్ని సాంబశివరావు, సుమన్ ఆంజనేయులు శర్మ, సిహెచ్ కిషోర్‌బాబు, అనిల్, రాజు నరసింహారావు పాల్గొన్నారు.

16 మంది జూదరుల అరెస్ట్

భట్టిప్రోలు: మండలంలో గురువారం కోడి పందేలు, పేకాట ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకుని రూ.5270 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. మండలంలోని పల్లెకోనలో పేకాటాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.2,270 అలాగే భట్టిప్రోలు శివారులో కోడి పందేలు వేస్తున్న 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.3 వేలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంలో రైతు మృతి

దాసరిపాలెంలో ఘటన

నగరం: దీపావళి పండుగ రోజు దాసరిపాలెంలో విషాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని తాడివాక వారిపాలెం పంచాయతీ పరిధిలోని దాసరిపాలెంలో విద్యుదాఘాతంలో రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన నున్నా వీరయ్య(70) పశువుల మేత కోసేందుకు పొలం వెళ్లాడు. గడ్డి కోస్తున్న సమయంలో విద్యుత్ వైరుకు కత్తి తగలడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడుకి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఘటనపై ఎలువంటి కేసు నమోదు కాలేదు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అక్రమంగా విద్యుత్ వైర్లును పంటపొలాల నుంచి మోటార్లుకు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదం సంభవించిందని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేయకుండా రాజీ కుదిరించినట్లు సమాచారం.

పట్టభద్రుల ఓటర్లు నమోదు చేసుకోవాలి



భట్టిప్రోలు: పట్టభద్రుల ఓటరు నమోదు చేసుకోవాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. కోనేటిపురంలో అర్హులైన పట్టభద్రులు ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి గౌతమ్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచి మోర్ల వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, పార్టీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, మల్లోలు నాగబాబు పాల్గొన్నారు.

దీక్షా దారులకు సద్ది

వెల్లటూరు(భట్టిప్రోలు): గ్రామ దేవత కట్లమ్మ తల్లి దేవాలయంలో అయ్యప్ప మాలధారులు అయ్యప్ప స్వామి ప్రధాన పీఠాన్ని ఏర్పాటు చేసి అయ్యప్ప, శివ, భవాని దీక్ష దారులకు ప్రతి రోజు సద్ది ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి దీక్షదారులు, గ్రామస్తులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. కార్యక్రమం 41 రోజుల పాటు కొనసాగుతుందని దేవస్థాన అభివృద్ధి కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు ఎంతమంది దీక్షాదారులు వచ్చినా సద్ది ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

భట్టిప్రోలు: కార్మికులు తమ రక్షణ కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భట్టిప్రోలు కార్యాలయం వద్ద పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, నాయకులు వి.శ్రీనివాసరావు, రమేష్, వంగర శ్రీనివాసరావు, అమ్రేష్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: ప్రముఖ న్యాయవాది హరిదాస్ శివప్రసాద్ 8వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తమ్ముడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో గురువారం రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివ లింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో పేదలకు అన్నదానం చేశారు. ముందుగా శివప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామాలలో ఏరులై పారుతున్న మద్యం

- విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు
- పచ్చ నేతల కనుసన్నల్లో నిర్వహణ
- షాపులను పంచుకున్న టీడీపీ, జనసేన నాయకులు
- రెస్టారెంట్‌ల పేరుతో అనధికారికంగా బార్లు
- చూసీచూడనట్టు అధికారులు



నగరంలో మద్యం విక్రయాలు జరుపుతున్న రెస్టారెంట్

నగరం: గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. కూటమి నేతలకు పండుగలా వ్యాపారం మారింది. లెక్కలేకుండా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేశారు. ఏ బడ్డీకొట్టు చూసినా వాటర్ బాటిల్ కంటే ఈజీగా మద్యం బాటిల్ దొరకుతోంది. మండలలో అధికారంగా ప్రభుత్వం మూడు దుకాణాలు మంజూరు చేసింది. అందులో నగరం, సజ్జవారిపాలెం, పర్సావారిపాలెం ఉన్నాయి. గ్రామంలోని జనాభాను బట్టి రేటు నిర్ణయించి రూ.50 వేల నుంచి సుమారు 2 లక్షల వరకు బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. డబ్బులు చెల్లించిన వారి షాపులపై పోలీసులు దాడులు జరగకుండా టీడీపీ నాయకులు చూస్తున్నారని, డబ్బులు చెల్లించకపోతే పోలీసులును పంపి వారిపై కేసులు నమోదు చేయిస్తున్నారని బెల్ట్ షాపుల నిర్వాహకులు చెబుతున్నారు.

చిన్న, చిన్న హోటళ్లలోనూ మద్యం..

గ్రామాలలో చిన్న, చిన్న హోటల్‌లలోనూ మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం బార్‌లో మాత్రమే మందు తాగేందుకు అనుమతులు ఉంటాయి. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాలలోని హోటల్‌లు బారులను తలపిస్తున్నాయి. హోటల్‌లోనే మద్యం విక్రయాలు చేస్తున్నారు. క్వార్టర్‌పై రూ.50 నుంచి 100 వరకు అధికంగా వసూలు చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరుగుతున్న పోలీసులు మాత్రం కన్నెత్తి చూడడం లేదు.

బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు

గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చింది. గ్రామాలలో అనధికారకంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటాం. హోటల్‌లలో మద్యం అమ్మకాలు జరపడం చట్టరీత్యానేరం. వారిపైన చర్యలు చేపడతాం.

– శ్రీరామ్‌ప్రసాద్, ఎక్సైజ్ సీఐ

బెల్ట్ షాపులను పంచుకున్న కూటమి నేతలు



దాసరి పాలెంలో మద్యం విక్రయిస్తున్న బడ్డీకొట్టు

గ్రామాలలో అనధికారకంగా నడుస్తున్న బెల్ట్ షాపులను టీడీపీ, జనసేన నాయకులు పంచుకున్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో సుమారు 380కు పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ఇవికాక నగరంలోనే 10కు పైగా బెల్ట్ షాపులను కూటమి నేతలు నడుపుతున్నారు. మద్యం జోలికి వస్తే సహించేది లేదని సీఎం చంద్రబాబు నాయుడు పదేపదే చెబుతున్న ఇక్కడ టీడీపీ, జనసేన నాయకులు పట్టించుకోవడం లేదు.

పింఛన్ల పంపిణీకి సర్వర్ కష్టాలు

- గ్రామ సచివాలయాల వద్ద లబ్ధిదారుల నిరీక్షణ
- ఇంటింటికి తిరగకుండా ఒక చోటే పంపిణీ



భట్టిప్రోలు: పింఛన్ల పంపిణీ ఆన్‌లైన్ సర్వర్ కష్టాలు ఎదురయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో పదిమందికి పింఛన్లు ఇవ్వగానే సర్వర్ పూర్తిగా ఆగిపోవడంతో ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లిపోయారు. ఆన్‌లైన్‌లో సర్వర్ వచ్చిన తరువాత పంపిణీ చేస్తామని తిరిగి వెళ్లడంతో పింఛన్‌దారులు వారి చుట్టూ తిరిగారు. మండలంలోని వెల్లటూరులో పింఛన్‌దారుల ఇంటికి ఎవరూ రాకపోయేసరికి సచివాలయం వద్దకు రిక్షా బాడుగకు కట్టించుకుని వృద్ధులు, వికలాంగులు వచ్చారు. గంటల పర్యంతం సచివాలయం వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే గ్రామాల్లో ఒక చోటకు పిలిపించి పింఛన్‌దారులకు పంపిణీ చేయడం జరిగింది. ఎంపీడీవో ఎస్.వెంకట రమణ మండలంలోని పెదలంక గ్రామంలో పింఛన్ల పంపిణీని పరిశీలించి పంపిణీ చేశారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ టి.ఉషారాణి ఉన్నారు.

వేమూరు మండలంలో..

వేమూరు: మండలంలోని సామాజిక పింఛన్లు 93 శాతం పింపిణీ చేసినట్లు శుక్రవారం ఎంపీడీఓ శివన్నారాయణ తెలిపారు.

ఘనంగా దీపావళి వేడుకలు



అంకమ్మ చెట్టు వద్ద భక్తులు వెలిగించిన దీపాలు

భట్టిప్రోలు: దీపావళి పండుగ వేడుకలను గురువారం భట్టిప్రోలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. గృహాల్లో దీపాల అలంకరణ చేపట్టి బాణసంచా కాల్చి పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

రేపల్లె మండలంలో..

రేపల్లె రూరల్: దీపావళి వేడుకలను గురువారం భక్తులు వైభవంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని సాయంత్రం సమయంలో లక్ష్మి అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి ముంగిళ్లల్లో కాంతులు విరజిమ్మేల దివ్వెలను ఏర్పాటు చేశారు. చిన్నారులు, పెద్దలు టపాసులను వెలిగించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని గ్రామదేవత బూరగలమ్మ అమ్మవారు ఆలయంలో, ఓల్డ్‌టౌన్‌లోని ఉమామహేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, అంకమ్మ చెట్టు, ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి, ఉప్పూడి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకమ్మతల్లి బజారు ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తులు ద్దీపాలను వెలిగించి భక్తిప్రవక్తలను చాటారు.



భట్టిప్రోలులో గాజులపేటలో అభయాంజనేయ స్వామి ఆలయంలో దీపావళి దీపాలంకరణ

వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



మోర్ల అక్షర

భట్టిప్రోలు: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎంలో 8వ తరగతి చదువుచున్న మోర్ల అక్షర ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు కూచిభొట్ల శ్రీనివాస శర్మ శుక్రవారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ఎ ఆధ్వర్యంలో శుక్రవారం నూతక్కిలో నిర్వహించిన అండర్-14 వాలీబాల్ పోటీలలో అక్షర సత్తా చాటింది. ప్రతిభ చూపిన అక్షరను పాఠశాల పాలక వర్గ అధ్యక్షులు వూపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావు, పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావు అభినందించారు.

పెరవలి విద్యార్థి



శ్రీరామ్

వేమూరు: ఉమ్మడి గుంటూరు జిల్లా వాలీబాల్ జట్టుకు పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.శ్రీరామ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరోజిని శుక్రవారం తెలిపారు. మంగళగిరి మండలంలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ పెడరేషన్ అండర్- 14 వాలిబాల్ పోటీలు గురువారం నిర్వహించారు. పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎస్.శ్రీరామ్ ఎంపికపై పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బుచ్చి రెడ్డి అభినందనలు తెలిపారు.

హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



కర్లపాలెం: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించనున్న జిల్లా జట్టు తరపున క్రీడాకారులు పాల్గొంటారు. పీడీ గోపీ తెలిపిన వివరాల ప్రకారం అండర్ -14 బాలుర విభాగంలో టి.వెంకట నవీన్, జె.రాతీష్ రాజు, బాలికల విభాగంలో ఎ.అక్షిత, ఎస్‌కే ఆయూష్, అండర్-17 బాలికల విభాగంలో కె.పావని, ఎ.సాయిలక్ష్మి, రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం టి.వెంకటరాజు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఈస్ట్ ఏషియన్ డాడ్జ్ బాల్ చాంపియన్ షిప్‌కు విద్యార్థి ఎంపిక



విద్యార్థి హేమప్రకాశ్

వేమూరు: ఈస్ట్ ఏషియన్ డాడ్జ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలకు కొల్లూరు మండలంలోని చిలుమూరు గ్రామంలోని శ్రీరామా రూరల్ విద్యా సంస్థకు చెందిన విద్యార్థి పైలా హేమ ప్రకాశ్ ఎంపికైనట్లు విద్యా సంస్థ డైరెక్టర్ కొలసాని తులసి విష్ణు ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2,3, తేదీల్లో మలేషియాలోని కౌలాలంపూర్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పైలా హేమ ప్రకాశ్, అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామంలో జన్మించాడు. శ్రీ రామా రూరల్ విద్యా సంస్థలో చదవుతున్నాడని ఆయన తెలిపారు. ఈస్ట్ ఏషియన్ డాడ్జ్ బాల్ చాంపియన్ షిప్‌కు ఎంపికైనందుకు శ్రీ రామ రూరల్ విద్యా సంస్థ సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు

భట్టిప్రోలు: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో మండల స్థాయిలో విద్యార్థులకు సైబర్ క్రైమ్స్‌పై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన వారికి శుక్రవారం ఎస్ఐ ఎం.శివయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.సుగుణ కుమారి పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ శివయ్య

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొల్లిపర: మైనర్ బాలుడు అతివేగంగా స్కూటీపై నడిపి ఎదురుగా మరో బైకు పై వస్తున్న యువకుడిని ఢీ కొట్టిన సంఘటన శుక్రవారం రాత్రి కొల్లిపర బీసీ కాలనీ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దావులూరు గ్రామంలోని నాగరాజు పాలెంకు చెందిన గాజుల తేజ అనే యువకుడు కొల్లిపర నుంచి దావులూరుకి వస్తుండగా దావులూరు అడ్డరోడ్డు లో నివాసం ఉంటున్న కుటుంబానికి చెందిన మైనర్ బాలుడు అడ్డరోడ్డు నుంచి కొల్లిపర వైపునకు వెళ్తూ అతివేగంగా గాజుల తేజను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తేజకు తలకు బలమైన గాయమవడంతో ప్రాథమిక చికిత్స అందించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు 108 ద్వారా తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే మైనర్ బాలుడు అక్కడి నుంచి స్కూటీ వదిలివేసి భయంతో పారిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

సాంకేతికతతో మెరుగైన ఉపాధి అవకాశాలు

రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ



బాపట్ల: ఆహార సాంకేతిక విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని రిటైర్డు ప్రొఫెసర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శిక్షణ ప్రారంభ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అసోసియేట్ డీన్ సర్దార్ బేగ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఫుడ్‌సైన్స్, ఫుడ్ టెక్నాలజీ, ప్రాసెసింగ్ ఇంజినీరింగ్ గురించి తెలియజేశారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వినోద్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మంతెనవారిపాలెం(కర్లపాలెం): భయాందోళనకు గురైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెంలో చోటు చేసుకుంది. యువకుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మూకిరి కోటయ్య(22) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. అతడి గొర్రెలతో పాటు గ్రామానికి చెందిన మరొక వ్యక్తి గొర్రెలకు కూడా కోటయ్య కాపలాదారుడిగా ఉంటున్నాడు. ఇటీవల కోటయ్య కొన్ని గొర్రెలను అమ్ముకోగా అమ్మిన గొర్రెలలో నావి ఉన్నాయని సదరు వ్యక్తి కోటయ్యతో గొడవపడటంతో గ్రామపెద్దలు అతడికి నష్ట పరిహారం ఇస్తామని సర్దిచెప్పారు. అయినప్పటికీ ఎవరు చెబితే నా గొర్రెలు అమ్మావు అంటూ సదరు వ్యక్తి కోటయ్యను బెదిరించటంతో భయాందోళనకు గురై ఊరి బయట చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడని తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చందోలు పోలీసులు తెలిపారు.

సూర్యలంక తీరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



బాపట్ల: కార్తిక మాసంలో భారీగా సముద్రస్నానాలకు భక్తులు వచ్చేందుకు అవకాశం ఉండటంతో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. మాసం పూర్తయే వరకు కార్మికులు ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమం అమలు ఉంటుందని చెప్పారు. సముద్రస్నానాలకు వచ్చే భక్తులు ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించరాదని సూచించారు. కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.కరుణ ఉన్నారు.

అష్టలక్ష్మి అమ్మవారికి ధనలక్ష్మి పూజ

తెనాలి: ఆశ్వయుజ బహుళ అమావాస్య దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేటలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో ధనలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు. రూపాయి నాణేలకు పూజ చేసి భక్తులకు అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేశారు. పండగ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ద్వాదశ హారతులు, మంగళవాయిద్యాలతో ఆలయం శోభాయమానంగా వెలుగొందింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. దండిస్వాముల ఆశీర్వాదంతో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరామచక్రవర్తి పూజలను నిర్వహించారు. ఇటువంటి కార్యక్రమాన్ని తెనాలి ప్రాంతంలో కేవలం అష్టలక్ష్మి దేవాలయంలోనే జరుగుతాయని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు

పోలీస్ శాఖకు అందించిన సేవలు చిరస్మరణీయం

- ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు ఎస్ఐలు
- ఘనంగా సత్కరించిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: గడిచిన మూడు దశాబ్దాలకు పైగా పోలీస్‌శాఖకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన బాపట్ల హెడ్ క్వార్టర్ ఎస్ఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఎస్ఐ బి.మాణిక్యరావులను శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదని చెప్పారు. ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంలోనే జరుగుతుందని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగంలో మనం చేరడం చాలా గొప్ప అదృష్టంగా భావించాలన్నారు. సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతయుతంగా విధులు నిర్వహించి, ఉద్యోగ వీరమణ పొందడం అభినందనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడపాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా కలవవచ్చునని, సహాయం చేసేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారుల సమక్షంలో పదవీ విరమణ పొందిన ఇద్దరు ఎస్ఐ లకు పూలమాల వేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్.ఐ డి.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన ఎస్ఐలను సన్మానిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

నేటి నుంచి కార్తిక మాసం పూజలు

- కార్తిక శోభను సంతరించుకున్న పెదపులివర్రు శివాలయం
- కాశీలో తరువాత పరస్పరం అభిముఖంగా శివ, వైష్ణవాలయాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): గ్రామంలో కొలువైన బాలా త్రిపురసుందరీ సమేత రాజరాజ నరేంద్ర స్వామి (శివాలయం), భూనీళా సమేత వరదరాజ స్వామి(వైష్ణవాలయం) దేవాలయాలకు ఒక విశిష్టత ఉంది. ఈ రెండు దేవాలయాలు పరస్పరం అభిముఖంగా ఉండటం విశేషం. ఇలా ఈ ఆలయాలు ఉత్తరాదిన కాశీలో, దక్షిణాదిన బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో ఉండటం గమనార్హం. స్వయంభుగా కొలువై నారద మహర్షియే నిత్య పూజలు అందుకున్న ఆ కైలాస నాథుని దివ్యానుభూతి రూపం రాజరాజ నరేంద్ర స్వామిగా కొలువై భక్తులతో నిత్య అభిషేకాలతో ప్రసన్న రూపంతో కనువిందు చేయడం ఇక్కడి విశేషం. వ్యాఘ్రపాద మహర్షి ఆశ్రమం రాజరాజ నరేంద్రుని దృష్టిని ఆకర్షించిన పవిత్ర క్షేత్రం. వ్యాఘ్రపాద మహర్షి కోరికపై కంచి వరదరాజ స్వామి ఇక్కడ వెలిశారు. రామానుజాచార్యులు ఇక్కడ వైష్ణవ ఆలయంలో విడిది చేసి వరదరాజ స్వామిని సేవించడంతో ఈ క్షేత్రం పవిత్ర స్థలంగా ప్రసిద్ధి గాంచింది ఈ దేవాలయాన్ని 1512లో బెజవాడ సామ్రాజ్యాధి నేతలు పునఃప్రతిష్ఠించినట్లు ఈదేవాలయంలో శాసనాలు ఉన్నాయి. కార్తిక మాసం పురస్కరించుకుని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయమంతా కార్తిక శోభ సంతరించుకుంది. కార్తిక మాసంలో భక్తులు వేకువజామున ఆలయానికి తరలి వస్తుంటారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కార్తిక దీపారాధనలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. శివాలయంలో శనివారం నుంచి కార్తీక మాస దీక్షా అభిషేకాలు, నిత్య కల్యాణాలు, లక్ష బిల్వార్చన, అన్నాభిషేకం, పంచదారాభిషేకం, జ్వాలాతోరణం, సామూహిక కుంకుమ పూజలు, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు జరగనున్నాయి. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ నిర్వహిస్తుండగా కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు, పర్యవేక్షిస్తున్నారు.



పెదపులివర్రులోని రాజరాజ నరేంద్రస్వామి దేవాలయం

కార్తిక మాస పూజలు

రేపల్లె రూరల్: కార్తికమాసంలో నెల రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆధ్యాత్మిక చింతన పొందేలా సభ్యులు కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషనస్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. గూనివారిపాలెం రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల విస్తృత సమావేశం శుక్రవారం నిర్వహించారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ

రేపల్లె రూరల్: మండలంలోని గుడ్డికాయలంకలో శుక్రవారం దీపం 2.0 గ్యాస్ సిలెండర్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ పాల్గొని 12 మంది లబ్ధిదారులకు సిలెండర్లు అందించారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశానుసారం గూడపాటి శ్రీనివాసరావు, యరగళ్ల వీరయ్య పాల్గొన్నారు.

నిజాంపట్నంలో..

నిజాంపట్నం: మండలంలోని అడవులదీవి గ్రామంలో ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, మురళీధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నర్రా సుబ్బయ్య పాల్గొన్నారు.

ఇంటూరులో..

అమృతలూరు(వేమూరు): దీపం-2 పథకం కింద మంజూరైన గ్యాస్ సిలెండర్‌లను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని ఇంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో రేపల్లె డివిజన్ రెవెన్యూ అధికారి ఎన్.రామలక్ష్మి, తహసీల్దారు నెహ్రూబాబు, ఎంపీడీఓ శేషామ్మాంబ పాల్గొన్నారు.